నిరుద్యోగ భృతి అందేదెప్పుడో..?



కూటమి నేతలు ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి లేదా ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావస్తున్నా, కార్యరూపం దాల్చలేదు. అర్హత గల ప్రతి నిరుద్యోగికీ భృతి చెల్లించాలి. ఇంటికో ఉద్యోగం హామీ నిలబెట్టుకోవాలి. నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తే ఎంతో మందికి మేలు జరుగుతుంది.

- తుమ్మల శ్రీనివాస్, యాదవోలు, దేవరపల్లి మండలం

రూ.30 వేల సాయం అందాలి



నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నా. అమ్మకు వందనం పథకంలో భాగంగా ఈ ఏడాది మాకు రూ.30 వేలు అందాలి. ఇప్పటికీ అమలు చేయకుండా నిబంధనల పేరుతో జాప్యం చేస్తున్నారు. దీంతో పిల్లల చదువు భారం అవుతోంది. సచివాలయాల్లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఈ ఏడాది నుంచే వర్తింపజేయాలి

- వడల రత్నకుమారి, సమిశ్రగూడెం

మూడు సిలిండర్లు గ్యాసేనా?



ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కూటమి నాయకులు ఇంటింటికీ వచ్చి ప్రచారం కూడా చేశారు. తీరా ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయడం లేదు. మూడు సిలిండర్లు ఇచ్చి హామీ నిలబెట్టుకోవాలి.

- కొవ్వూరు ధనలక్ష్మి, గృహిణి, గోపాలపురం

ప్రతి మహిళకూ రూ.1,500 ఇచ్చేదెప్పుడు?




తాము అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.15 వేల చొప్పున అందిస్తామని టీడీపీ, ఇతర కూటమి నేతలు మహిళలను మభ్యపెట్టారు. అధికారం చేపట్టి 100 రోజులు కావస్తున్నా, ఇచ్చిన హామీకి దిక్కులేదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోదీలు మహిళల ఆశలను అవకాశంగా తీసుకున్నారు.

- కప్పల ధనలక్ష్మి, గోపాలపురం

సూపర్ తూచ్

- సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో హామీ
- బాబు ష్యూరిటీ...భవిష్యత్ గ్యారంటీ అంటూ ప్రచారం
- అమలులో కూటమి ప్రభుత్వం మీనమేషాలు
- వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం అంటూ ప్రకటన
- మూడు గ్యాస్ సిలిండర్లదీ అదే పరిస్థితి
- తక్షణం అమలు చేయాలంటున్న జనం



కొవ్వూరు: చంద్రబాబు హామీలు నమ్మి జనం మరోసారి మోసపోయారు. బాబు ష్యూరిటీ .. భవిష్యత్ గ్యారంటీ అంటూ ఊరూవాడా ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రచారం ఊదర గొట్టారు. సార్వత్రిక ఎన్నికల వేళ సూపర్ సిక్స్ పేరుతో కూటమి నాయకులు ఆరు హామీలను ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని నమ్మించారు. అయితే అధికారంలోకి వచ్చి ఇప్పటికే 100 రోజులు కావస్తున్నా హామీల ఊసే ఎత్తడం లేదు. అదీగాక సూపర్ సిక్స్‌ను చూస్తుంటే భయమేస్తోంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా వ్యాఖ్యానించడంతో జనం నివ్వెరపోతున్నారు. మూడు గ్యాస్ సిలిండర్ల హామీని ఇప్పుడు అమలు చేయడం లేదంటూ మంత్రి నాదెండ్ల మనోహర్, తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఖాతాకూ ప్రతి నెలా రూ.1,500 చొప్పున జమ చేస్తామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అన్నారు. 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, లేదంటే ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామన్న హామీపైనా కూటమి సర్కారు నోరు మెదపడం లేదు. ఎప్పటిలోగా ఈ పథకాలను అమలు చేస్తారో ప్రకటించక పోవడం విమర్శలకు తావిస్తోంది.

అమ్మల ఆశలు ఆవిరి

తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాకు అందిస్తామంటూ కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల ముందు హామీ గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక, ఈ పథకం విధివిధానాలు ఖరారు చేసి వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ఇటీవలే ప్రకటించారు. దాంతో తల్లుల ఆశలు ఆవిరయ్యాయి.

అన్నదాతలకూ నిరాశే

రాష్ట్రంలో ప్రభుత్వం మారాక రైతులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. తాము అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ ఏడాది రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు నట్టేట ముంచారు. కొవ్వూరు డివిజన్‌లో 69,166 మంది రైతులు ప్రభుత్వ సాయం కోసం ఇప్పటికీ ఆశగా ఎదురు చూస్తున్నారు.

రంచనుగా అమ్మఒడి, రైతుభరోసా



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో చదువుకునే పిల్లల తల్లులకు, అన్నదాతలకు మేలు జరిగింది. ప్రతి విద్యార్థి తల్లి ఖాతాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున జగన్ ప్రభుత్వం జమ చేసింది. పాఠశాలలు తెరవక ముందే మే లోనే ఈ సొమ్ములు జమ అయ్యేవి. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో 65,879 మంది తల్లుల ఖాతాలకు ఏటా రూ.రూ.98,81,85,000 చొప్పున జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జమ చేసింది. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన పేరుతో ఏటా ప్రతి వారి ఖాతాకు రూ.13,500 చొప్పున వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించేది. ఏటా వ్యవసాయ సీజన్ మొదలవక ముందే ఈ మొత్తాన్ని రంఛన్‌గా అందించే వారు.

ప్రతి ఇంటికీ ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	63,879
నిడదవోలు	71,420
గోపాలపురం	62,407
మొత్తం లబ్ధిదారులు:	1,97,706

ఒక్కో కుటుంబానికి మూడు చొప్పున - 5,93,118 (ఇవ్వాల్సిన సిలిండర్ల సంఖ్య)

ఒక్కో కుటుంబానికి చేకూరే లబ్ధి- రూ.2,505 (సిలిండర్ ధర రూ.835)

మొత్తం: 5,93,118 X 2,505= రూ.1,485,760,590

ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	1,13,877
నిడదవోలు	1,30,326
గోపాలపురం	1,10,558
మొత్తం లబ్ధిదారులు	3,54,761

ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి



నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	63,879
నిడదవోలు	71,420
గోపాలపురం	62,407
మొత్తం లబ్ధిదారులు	1,97,706

ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున చెల్లించాల్సిన మొత్తం: రూ.59,31,18,000

మహిళలకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున



నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	50,181
నిడదవోలు	57,058
గోపాలపురం	67,016
మొత్తం లబ్ధిదారులు	1,74,255

నెలకు ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున రూ.26,13,82,500

ఒక్కొక్కరికి ఏడాదికి చెల్లించాల్సిన మొత్తం: రూ.18,000

అన్నదాతా సుఖీభవ



(ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున)

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	16,646
నిడదవోలు	27,090
గోపాలపురం	25,460
మొత్తం లబ్ధిదారులు	69,196

ఒక్కో లబ్ధిదారుడికి రూ.20 వేలు చొప్పున చెల్లించాలి

ఈ లెక్కన 69,196 X 20,000 = 1,383,920,000

తల్లికి వందనం



నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొవ్వూరు	20,501
నిడదవోలు	21,768
గోపాలపురం	23,610
మొత్తం లబ్ధిదారులు	65,879

ఒక్కో లబ్ధిదారునికి రూ.15 వేల చొప్పున చెల్లించాలి

చెల్లించాల్సిన మొత్తం రూ.98,81,85,000

'అమ్మకు వందనం' నిలబెట్టుకోవాలి



నాకు ముగ్గురు పిల్లలు. అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్నా, ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఫీజు ఎక్కువైనా మా పిల్లలను ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాం. తీరా ఇప్పుడు అమ్మకు వందనం పథకాన్ని వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తానని ప్రభుత్వం చెప్పడంతో మా పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. నా భర్త రామకృష్ణ కూలి పనికి వెళతారు. ఆ కొద్దిపాటి ఆదాయంతో ఫీజులు కట్టాలంటే చాలా కష్టం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఈ ఏడాది నుంచే అమ్మకు వందనం చెల్లించి మాట నిలబెట్టుకోవాలి.

- పసలపూడి చంద్రిక, సమిశ్రగూడెం, నిడదవోలు మండలం

'సుఖీభవ' కాదు దుఃఖీభవ



రైతు భరోసా పథకం కింద జగన్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.13,500 చొప్పున మా ఖాతాలో నేరుగా జమ అయ్యాయి. ఈ మొత్తం జూన్‌లో సాగు పెట్టుబడికి ఉపయోగ పడేది. గత ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాలకు ఏటా రూ.20 వేలు జమ చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. మే 18న పీఎం కిసాన్ యోజన కింద రూ.2 వేలు మాత్రమే జమ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం సుఖీభవ విడుదల చేయాలి

- కొలిశెట్టి నాగేశ్వరరావు, రైతు, రావూరుపాడు, తాళ్లపూడి మండలం

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?



ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నాయకులు మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికీ ఆ ప్రస్తావనే లేదు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రభుత్వం హామీలన్నింటినీ గాలికి వదిలేసింది. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే మాకు ప్రయాణ ఖర్చులు కలిసొస్తాయి.

- పెంటగంటి చిట్టమ్మ, నిడదవోలు

క్లుప్తంగా

కమిషనర్‌గా నాగేంద్రకుమార్ బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు: మునిసిపల్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పలాస మునిసిపాలిటీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ కొవ్వూరు కమిషనర్‌గా పని చేసిన దానియేల్ జోసెఫ్ కనిగిరి మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు. కాగా కొవ్వూరు మునిసిపల్ మేనేజర్‌గా పనిచేసిన పి.రాధాకృష్ణ రామచంద్రపురం మునిసిపాలిటీకి రెవెన్యూ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. రాధాకృష్ణ స్థానంలో పిఠాపురం నుంచి పి.సాయిబాబు కొవ్వూరు మునిసిపల్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. ఆయన కూడా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరు మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న డీవీ వెంకటరమణ భీమవరం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. నాగేంద్రకుమార్ గతంలోను కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

చాగల్లు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ, జనసేన మండలంలోని దారవరం గ్రామ శాఖల నాయకులు, కార్యకర్తలు రూ.101,116 విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయ నిధికి అందజేయవలసిందిగా బుధవారం వారు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణ, బొడ్డు రాజు, బొడ్డు కేశవ, కట్టా స్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో సేంద్రియ ఎరువులు

నల్లజర్ల: రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పుతున్నట్టు సేంద్రియ వ్యవసాయంలో మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తెలిపారు. మారెళ్లమూడి గ్రామంలో 15 ఎకరాల్లో సాగవుతున్న సేంద్రియ వరిపైరుకు ఎండు తెగులు సోకింది. ఆ తెగులు నివారణకు బుధవారం డ్రోన్ సాయంతో వేపగింజల కషాయం, ఇంగువ, పుల్లటి మజ్జిగ కలిపి పిచికారి చేయించారు.

సందడిగా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు



దేవరపల్లిలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు స్థానిక ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో కోలాహలంగా జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 బాలికలు, బాలుర ఎంపిక పోటీలను బుధవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రారంభించారు. హైస్కూల్ హెచ్ఎం కె.శ్రీలక్ష్మి అధ్యతన నిర్వహించిన సభలో ఎంపీపీ దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెరికల్లాంటి వందలాది క్రీడాకారులు మండలంలో ఉన్నారన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు కూడా సాధించారన్నారు. ఎంఈఓ ఎం.తిరుమలదాస్ మాట్లాడుతూ నియోజకవర్గస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు దేవరపల్లి, దుద్దుకూరు జెడ్పీ హైస్కూళ్లలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం దేవరపల్లిలో అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు, దుద్దుకూరులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయని వివరించారు. వ్యాయామోపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు మాట్లాడుతూ దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల నుంచి 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, మాజీ సర్పంచ్ కాత్రు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన తప్పనిసరి



డి.ముప్పవరంలో రైతులకు ఎలుకల మందు అందజేస్తున్న జేడీఏ మాధవరావు

నిడదవోలు రూరల్: రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని డి.ముప్పవరంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎలుకల మందు తయారీ, పొలాల్లోని బొరియల్లో పెట్టే విధానంపై ఆయన వివరించారు. ఎలుకల వల్ల పంట నష్టం ఎక్కువగా ఉంటుందని, సకాలంలో నిర్మూలన చేపట్టాలన్నారు. కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రామలక్ష్మి, ఏవో జి.సత్యనారాయణ, రైతులు పసుపులేటి చిట్టియ్య, మేడా పూర్ణ, సంగినీడి సత్తిపండు, మారిశెట్టి అమ్మిరాజు, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: పంట దిగుబడులకు నష్టం కలిగించే ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపడితేనే ఫలితం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు సూచించారు. వరి పంటపై ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎరలను మండల వ్యాప్తంగా బుధవారం వ్యవసాయ శాఖ రైతులకు అందజేసింది. కాల్దారి గ్రామంలో విశ్వాసరావు ఈ ఎరను రైతులకు అందజేశారు. అలాగే మండలంలోని 15 గ్రామాల్లో ఆయా పంచాయతీ సర్పంచుల ఆధ్వర్యంలో బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎరలను రైతులకు పంపిణీ చేశారు. ఈ ఎరను రైతులు వరి పొలం గట్ల వద్దనే కాకుండా ఖాళీ దిబ్బలు, కళ్లాలు, కాలువ గట్లపైన కూడా పెట్టాలని వ్యవసాయ సిబ్బంది సూచించారు.

నేటి నుంచి మూడు రోజులు విద్యుత్ సరాఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: అభివృద్ధి పనుల నిమిత్తం ఉండ్రాజవరం, చిలకపాడు సత్యవాడ, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాలకు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఎస్.దొరబాబు బుధవారం తెలిపారు. ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు ఆదేశాల మేరకు ఈ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 2 గంటకు ఇచ్చేలా మార్పు చేసినట్లు తెలిపారు.

ఘనంగా గణనాథుని ఊరేగింపు



దేవరపల్లిలో శ్రీవిఘ్నేశ్వర లారీ వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహం ఊరేగింపు



వేలంలో స్వామివారి లడ్డూ దక్కించుకున్న నిడదవోలు మాజీ కౌన్సిలర్ సుంకవల్లి శ్రీధర్

దేవరపల్లి: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనాలు జోరుగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక శ్రీవిఘ్నేశ్వరా లారీ వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన లారీపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. అలాగే స్థానిక బ్రాహ్మణ వీధిలో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహాన్ని కూడా వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా లారీ వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఊరేగింపు అనంతరం ప్రతిమలను జలాశయాల్లో నిమజ్జనం చేశారు.

గణనాథునికి సీఐ పూజలు

నిడదవోలు: స్థానిక గణేష్ చౌక్ సెంటర్లోని శ్రీపూజా గణపతి కుమారస్వామి వారి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడ్ని మంగళవారం రాత్రి నిడదవోలు సీఐ వి.శ్రీనివాసరావు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గజమాల, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, ముప్పనబోయిన గంగారావు, కారింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేశ్ చౌక్ వినాయకుని ఊరేగింపు

స్థానిక గణేశ్ చౌక్‌లో ప్రతిష్ఠించిన పూజ గణపతి విగ్రహాన్ని గురువారం ఊరేగిస్తారు. ఉదయం 11 గంటలకు విగ్రహాన్ని హంస వాహనంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు తెలిపారు. అనంతరం వినాయక విగ్రహాన్ని పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో నిమజ్జనం చేస్తామన్నారు. ఊరేగింపులో కేరళ నృత్యాలు, కోయ డ్యాన్స్, కోలాటం, బుట్టబొమ్మలు, సన్నాయి మేళం, బ్యాండ్ మేళం, కాళికా మాత నృత్య ప్రదర్శన, తీన్మార్ బ్యాండ్ మేళం, కోబ్రా డ్యాన్స్, గరగల నృత్యాలు ఏర్పాటు చేశామన్నారు.

రూ.10 వేలు పలికిన వినాయక లడ్డూ

స్థానిక యాదవుల వీధిలోని మంటపం వద్ద ప్రతిష్ఠించిన వినాయకునికి సమర్పించిన లడ్డూకు బుధవారం వేలం వేశారు. మాజీ కౌన్సిలర్ సుంకవల్లి శ్రీధర్ రూ.10 వేలకు వేలంలో ఈ లడ్డూను దక్కించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు నీలం రామారావు, గంగుల గోపీయాదవ్, గుడ్ల అబ్బాయి, భోగిరెడ్డి రామకృష్ణ, పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసమితి మండల నూతన కార్యవర్గం

ఉండ్రాజవరం: మండల బ్రాహ్మణ సేవాసమితి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఉండ్రాజవరంలో నిర్వహించిన సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడిగా ఏలేశ్వరపు భాస్కరరావు, అధ్యక్షుడిగా జ్యోశుల వెంకట సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా రాపర్తి వెంకట్రామయ్య, కార్యదర్శిగా జ్యోశుల విజయ్‌కుమార్, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. వారందరికీ సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుదప చక్రపాణి, బ్రాహ్మణమిత్ర సేవా సంఘం కార్యదర్శి ఆకెళ్ల శ్రీనివాసు, మాజీ అధ్యక్షుడు దోనేపూడి సుధాకర్, వైవీ రామకృష్ణ మూర్తి, మద్దిరాల ఏడుకొండలు, ఈ.సత్యకృష్ణ, కోడూరి శ్రీరామచంద్రమూర్తి, దోనేపూడి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 108 బిందెలతో జలాభిషేకం



ప్రక్కిలంక గ్రామదేవత మావుళ్లమ్మకు అభిషేకం చేస్తున్న మహిళలు

తాళ్లపూడి: పౌర్ణమి సందర్భంగా ప్రక్కిలంక గ్రామదేవత మావుళ్లమ్మకు బుధవారం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచీ గ్రామంలోని మహిళలు గ్రామోత్సవం నిర్వహించి, 108 బిందెలతో గోదావరి జలాలు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం దాతల సహకారంతో తయారు చేసిన మకర తోరణాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో మావుళ్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయకునికి 108 ప్రసాదాల మహా నివేదన



ప్రక్కిలంకలో వినాయకునికి 108 ప్రసాదాల మహా నివేదన

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని లక్ష్మీగణపతి ఆటోమోటార్ వర్కర్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకునికి బుధవారం 108 ప్రసాదాలతో మహా నివేదన చేశారు. ఆటోమోటార్స్ వర్కర్స్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఒక్కో ఇంటి నుంచి ఒక్కో ప్రసాదాన్ని తయారుచేసి తీసుకుని వచ్చి బొజ్జ గణపయ్యకు సమర్పించారు. అనంతరం ప్రసాదాలను పంచి పెట్టారు.